నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | RANGAREDDY

తరలివచ్చి.. సక్సెస్ చేసి..

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గులాబీ జెండాలను ఆవిష్కరించి వరంగల్ సభకు భారీగా తరలివచ్చి సక్సెస్ చేసిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. గులాబీ గుబాలింపును, అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని నేరుగా టీవీలు, సోషల్ మీడియాలో ఆసక్తిగా వీక్షించిన కోట్లాది మంది తెలంగాణవాదులకు, మమ్ముల్ని ప్రోత్సహించిన ప్రతినిధులకు శత కోటి వందనాలు. రజతోత్సవ సభ విజయోత్సవ ఉత్తేజంతో తల్లి తెలంగాణకు పునర్వైభవాన్ని తీసుకొచ్చేందుకు కదనోత్సాహంతో పనిచేద్దాం.

-మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి,
బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ

నమస్తే ఎఫెక్ట్

కులకచర్ల, ఏప్రిల్ 28 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన కోడిగుడ్లను బయట విక్రయిస్తున్నారంటూ.. అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. సోమవారం వారు చౌడాపూర్ మండల కేంద్రానికెళ్లి అంగన్‌వాడీ టీచర్‌ను కోడిగుడ్ల విషయంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి గుడ్లు ఎలా బయటికొచ్చామని ఆగ్రహం వ్యక్తం చేసి మెమో జారీ చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, కోడిగుడ్లను షాపుల్లో విక్రయిస్తున్న వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు సమాచారం. ఐసీడీఎస్ అధికారులు కూడా నామమాత్రంగా విచారణ జరిపినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫుల్ జోష్



రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్‌తో గులాబీ దండులో నూతనోత్సాహం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగంతో శ్రేణుల్లో నిండిన ఆత్మస్థైర్యం
- గుండెల నిండా రణ నినాదం చేసిన గులాబీ జెండా
- నాటి ఉద్యమం నాటి రోజులను యాదికి తెచ్చిన బహిరంగ సభ
- మండుటెండను సైతం లెక్క చేయని జనం
- భారీగా వెళ్లి సత్తా చాటిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు

వికారాబాద్/రంగారెడ్డి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): వరంగల్‌లో జరిగిన రజతోత్సవ మహాసభ ఊహించిన దానికంటే గ్రాండ్ సక్సెస్ అయింది. ఎల్కతుర్తి సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తరలివచ్చిన లక్షలాది మంది కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. బహిరంగ సభకు వచ్చిన భారీ జన సందోహంతో గులాబీ శ్రేణులు ఉద్యమకాలం నాటి ఉద్వేగానికి లోనయ్యారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగంతో ఆత్మవిశ్వాసం నిండిందని.. కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టి ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు సిద్ధం కావాలని ఇచ్చిన పిలుపు తమకెంతో స్ఫూర్తినిచ్చిందని.. పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. రేవంత్ సర్కార్ గత 16 నెలలుగా వివిధ కేసులతో భయపెడుతున్నా.. కాంగ్రెస్ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా ఎల్కతుర్తి సభకు వెళ్లే ముందు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని గ్రామాలు, వార్డుల్లో గులాబీ జెండాలు రెపరెపలాడాయి. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్.. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలోనూ గులాబీ జెండాలను ఎగురవేసి, పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించారు.

బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం..

25 వసంతాల బీఆర్ఎస్ పార్టీ పండుగను పురస్కరించుకొని ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగలో అధినేత కేసీఆర్ ప్రసంగం ప్రతి కార్యకర్తనూ కదిలించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్బండ వర్ణాలు పడుతున్న కష్టాలను గుర్తు చేసిన గులాబీ బాస్, ఏడాదైనా సమయం ఇవ్వాలని వేచి చూశామని.. ఎక్కడ పొగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాల్సిన సమయం ఆసన్నమైందని.. కడుపు కట్టుకొని తెలంగాణ రాష్ట్ర ఆదాయాన్ని పెంచితే కాంగ్రెస్ పార్టీ రాగానే దివాలా తీయడం బాధగా ఉందని పేర్కొనడంతోపాటు కేసులకు భయపడొద్దని, మీకు అండగా మేము ఉంటామని.. అన్ని వర్గాలకు అండగా ఉండి ముందుకెళ్లి, మళ్లీ గులాబీ జెండాను ఎగురవేయాలన్న కేసీఆర్ ప్రసంగంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉద్యమ కాలం నాటి ఉద్వేగానికి లోనయ్యారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగంతో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే అంటూ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి..

అలవి కాని హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అన్యాయం చేయడంపై ఎల్కతుర్తి వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ పాలనపై మండిపడ్డారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్, రైతు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతు బీమా, అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు, ఇంటింటికీ నల్లాల ద్వారా మిషన్ భగీరథ తాగునీరు, చెరువులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మిషన్ కాకతీయ లాంటి పలు పథకాలను అమలు చేసి బంగారు తెలంగాణలా తీర్చిదిద్దామని కేసీఆర్ గుర్తు చేశారు. అయితే, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా నట్టేట ముంచడంతో పాటు కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, ఊరూరా తాగునీటి కోసం బిందెలతో మహిళలు కిలోమీటర్ల మేర వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని.. అవినీతి పెరిగిపోయిందని, ఇలా పలు అంశాలపై కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు.

పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

రజతోత్సవ సభతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. దొంగ హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అధినేత ఎండగట్టారు. కేసులకు భయపడొద్దు.. అండగా ఉంటామంటూ కేసీఆర్ ఇచ్చిన భరోసాతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు.. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగురడం ఖాయం.

- పైలట్ రోహిత్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే

ఇది ఆరంభం మాత్రమే..

- డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు

ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇది ఆరంభం మాత్రమే..రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల వేడుకలకు సంబంధించి మరిన్ని వేడుకలను నిర్వహిస్తాం. ఇక నుంచి అడగడుగునా ప్రజా సమస్యలపై పోరాడి, ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచుతాం. అదేవిధంగా, కాంగ్రెస్ పాలకులు సభను అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చారు. సభ సక్సెస్ కావడంతో భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు

కాంగ్రెస్ నాయకుల్లో వణుకు పుట్టించింది..

రజతోత్సవ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో వణుకు పుట్టించింది. వరంగల్ సభ జనసంద్రంతో మరో చరిత్రను సృష్టించింది. పార్టీ రజతోత్సవాన్ని పురస్కరించుకుని ఊరూవాడల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ప్రత్యేక వాహనాల్లో సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు, అభిమానులు చూపిన ఉత్సాహం చాలా సంతోషంగా ఉన్నది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని ఈ బహిరంగ సభతో స్పష్టమైంది. కాంగ్రెస్ పాలనలో కరువు తప్పదని, సంక్షేమం కుంటుపడుతుందని ప్రజలు గ్రహించారు. రానున్నది మనదే ప్రభుత్వమని పార్టీ అధినేత కేసీఆర్ అనగానే వీక్షకుల చప్పట్లు, అరుపులు, కేకలతో సభాప్రాంగణం దద్దరిల్లింది. కేసీఆర్ ప్రసంగంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొన్నది. సభ సక్సెస్‌కు సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు. **-పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ మ్మెల్యే కొడంగల్**

రజతోత్సవ మహాసభ సక్సెస్

వరంగల్‌లో జరిగిన బహిరంగ సభ ఊహించిన దానికంటే ఎక్కువగా విజయవంతమైంది. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఎక్కడ చూసినా ఎల్కతుర్తి సభ సక్సెస్‌పైనే చర్చించుకుంటున్నారు. అధికార పార్టీపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉన్నదో ఈ మహాసభ జయప్రదం కావడం ద్వారా తేటతెల్లమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం స్వయంగా వినాలనే ఉత్సాహంతో వేలాది మంది సభకు తరలివచ్చారు. పార్టీ ఏర్పాటు నుంచి పదేండ్లలో తెలంగాణను ఎంత అభివృద్ధి చేసింది కేసీఆర్ చక్కగా వివరించారు. గత పదహారు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో ఫెయిలైందని కేసీఆర్ చెప్పగా సభకు వచ్చిన వారంతా అవునని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. భవిష్యత్తులోనూ ప్రజల సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా పోరాడుతామని.. రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పడం ద్వారా కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించారు. రజతోత్సవ సభకు పరిగి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు.

-కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పరిగి

అనుకూలమైన చోటు కోసం అడ్డదారులు

- నిబంధనలకు విరుద్ధంగా పరస్పర బదిలీలు
- రంగారెడ్డి 'విద్యాశాఖ'లో మితిమీరిన రాజకీయ జోక్యం
- భారీగా డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు

రంగారెడ్డి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లా విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. బదిలీలు, అనుకూలమైన చోటుకు వెళ్లేందుకు టీచర్లు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. జిల్లాలో పోస్టులు లేకున్నా.. అధికారుల అండదండలతో ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు జిల్లాలోకి వచ్చి చేరుతున్నారు. వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిబంధనలు అడ్డొస్తున్నా.. విద్యాశాఖ అధికారులు యథేచ్ఛగా బదిలీలు చేస్తున్నారు. బదిలీ అయిన పాఠశాలల్లో ఆయా సబ్జెక్టుల పోస్టులు ఖాళీ లేకపోవడంతో వేతనాలు చెల్లించడంలోనూ గందరగోళం నెలకొన్నది.



స్పౌజ్ కేటాయింపుల్లో అవకతవకలు..

ప్రభుత్వం నియమించిన 317 జీవో కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు మేరకు జిల్లా స్పౌజ్ కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. తలకొండపల్లి మండలంలోని జడ్పీహెచ్ఎస్ పడకల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ బోధిస్తున్న వారి స్పౌజ్ కేటాయింపు నాగర్‌కర్నూల్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌ను కౌన్సెలింగ్ ద్వారా అదే మండలంలో జడ్పీహెచ్ఎస్ ఖానాపూర్ పాఠశాలకు మొదటగా కేటాయించారు. కానీ, వారు విధుల్లో చేరలేదు. ఆ పాఠశాలలో ఒకే ఇంగ్లిష్ పోస్టున్నప్పటికీ వారికి 24 శాతం హెచ్ఆ

మితిమీరిన రాజకీయ జోక్యం..

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ విషయంలో మితిమీరిన రాజకీయ జోక్యం, డబ్బుల ప్రలోభాలు పెద్ద ఎత్తున తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా 317 జీవోను అడ్డం పెట్టుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పెద్దఎత్తున రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వస్తున్నారు. వీరి బదిలీల్లో తెరవెనుక అధికార పార్టీకి చెందిన బ్రదర్స్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఆయా పోస్టులు లేకున్నా.. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి జిల్లా విద్యాశాఖ అధికారులు వారిని చేర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ జరిపించాలి

జిల్లా విద్యాశాఖలో బదిలీల బాగోతంపై పారదర్శకంగా విచారణ జరిపించాలి. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయి. ఇతర జిల్లాల నుంచి 317 జీవోను అడ్డంపెట్టుకుని జిల్లాకు రావడంతో పాటు సీనియారిటీ పేరుతో హెచ్ఆర్ఏ ప్రాంతాలకూ వస్తున్నారు. దీంతో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- బొడ్డు రవి, సేవ్ టీచర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

ర్ఏ ప్రాంతమైన సరూర్‌నగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ రాజీవ్‌గాంధీనగర్ పాఠశాలకు 20 రోజుల తర్వాత కేటాయించారు. వీరికి కూడా రీ కౌన్సెలింగ్ తర్వాత తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ జిల్లా పరిషత్‌కు కేటాయించాలి..కానీ, కేటాయించకుండా అదే స్థానం రాజీవ్‌గాంధీనగర్‌లోనే కొనసాగిస్తున్నారు. ఇది పూర్తిగా స్పౌజ్ నిబంధనలకు విరుద్ధం.

తప్పుల తడకగా సీనియారిటీ లిస్టు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు లేవు. అయినా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, సోషల్ రెండు స్పౌజ్ పోస్టుల్లోనూ ఇచ్చారు. వారిలో ఒక్కరిని స్పౌజ్ కింద కడ్తాల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని ఆ మండలంలోనే ఏదో ఒక్క పాఠశాలలో కేటాయించాలి. కానీ.. పోస్టులు లేని తొర్రూరు పాఠశాలకు 24 శాతం హెచ్ఆర్ఏతో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్‌ను కేటాయించారు. అలాగే, స్పౌజ్‌లో భాగంగా మరో ఉపాధ్యాయురాలు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పోస్టులు లేని తొర్రూరు పాఠశాలకు కేటాయించారు. తిరిగి రీ-కౌన్సెలింగ్ ద్వారా జడ్పీహెచ్ఎస్ తారామతిపేటకు కేటాయించారు. అలాగే, ఇబ్రహీంపట్నం మండలంలోని శేరిగూడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టులు లేకున్నా నాగర్‌కర్నూల్ జిల్లానుంచి స్పౌజ్ కేటాయింపులో శేరిగూడ పాఠశాలకు.. రీ-కౌన్సెలింగ్ ద్వారా ఒక్క ఉపాధ్యాయుడ్ని కప్పాడుకు కేటాయించారు. అలాగే, రాజేంద్రనగర్ మండలంలోని పద్మశాలీపురంలో ఓ ఉపాధ్యాయుడు ఈ నెలలో ఉద్యోగవిరమణ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జీవో 317 అమలు సమయంలో అతను జడ్పీహెచ్ఎస్ ఆకుతోటపల్లిలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడిని సీనియారిటీ లిస్టులో నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించారు. నిబంధనలకు విరుద్ధంగా అతడ్ని వికారాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ విషయంపై సేవ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా .. పట్టించుకునే నాథుడే లేడు. జీవో 317 ద్వారా సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి సీనియారిటీ పేరుతో రంగారెడ్డి జిల్లాకు వచ్చారు. సబ్జెక్టుకు సంబంధించిన పోస్టులు లేకున్నా.. పరిమితికి మించి జిల్లాలో అధికారులు చేర్చుకున్నారు.

తొలిసారిగా పేగు మార్పిడి..

ఉస్మానియాలో మరో అరుదైన శస్త్రచికిత్స

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తొలిసారిగా ఓ వ్యక్తికి పేగు మార్పిడి చేశారు. 40 ఏండ్ల ఓ వ్యక్తి షార్ట్‌గట్ సిండ్రోమ్ అనే పేగు సమస్యతో బాధపడుతూ ఉస్మానియాలో చేరాడు. పదే పదే సెంట్రల్‌లైన్ ఇన్‌ఫెక్షన్స్‌తోపాటు రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం తదితర కారణాలతో రోగి చిన్న పేగులోని కొంతభాగాన్ని తొలగించారు. దీంతో చిన్నపేగు పరిమాణం 30 సెం. మీలకు కుంచించుకుపోయింది. పేగు పరిమాణం తగ్గడంతో ఆక్సిజన్, ఇతర పోషకాలను తీసుకోలేక శరీరం బలహీనంగా మారి, ప్రాణాపాయ స్థితికి చేరాడు. సమస్య రోజురోజుకూ తీవ్రమయ్యే అవకాశాలుండడంతో రోగికి పేగు మార్పిడి చేయాలని నిర్ణయించిన సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్.. ఈనెల 9న జీవన్మృతుడి నుంచి సేకరించిన పేగును మార్పిడి చేశారు. సర్జరీ సక్సెస్ కావడంతో రోగి క్రమంగా కోలుకుంటున్నట్లు డాక్టర్ మధుసూదన్ తెలిపారు. పేగు మార్పిడి చేయడం తెలుగు రాష్ట్రాల్లోనే ఇది తొలిసారి అని వైద్యులు తెలిపారు.

ఖజానా నింపుకొనేందుకు..

తెరపైకి ఎల్ఈడీ డిజిటల్ బోర్డులు
-రూ.749 కోట్లతో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్ వద్ద హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు
-రోడ్ల విస్తరణకు 269 చోట్ల ఆస్తుల స్వాధీనం
-మే 1న స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదనలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనున్నది. పదకొండు ఎజెండాలను స్టాండింగ్ కమిటీ ముందు ఉంచేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ప్రధానంగా 11 చెరువుల పరిరక్షణ, అధ్యయనం, నిర్వహణ బాధ్యతలను నీరి సంస్థకు అప్పజెప్పాలని ప్రతిపాదించారు. బండ్లగూడ క్రాస్ సమీపం లో రూ.212 లక్షలతో 1600 ఎంఎం డయా ఎంఎస్ పైపులైన్ పనులను ఆమోదించనున్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా గోపన్‌పల్లిలోని సర్వేనంబర్ 34లో 4,350 స్క్వేర్ యార్డ్స్‌లో యానిమల్ హాస్పిటల్ ఫ్యాకల్టీ ఏర్పాటు, 25 ఏండ్ల నిర్వహణ బాధ్యతలు రాంకీ ఫౌండేషన్‌కు అప్పగించనున్నారు. డబీర్‌పురా ఠాణా నుంచి నాగబౌలి జంక్షన్ వరకు రూ.510 లక్షలతో రహదారి విస్తరణ, అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజెస్ మూడేండ్ల పాటు సీఎస్ఆర్ పద్ధతిలో జూబ్లీహిల్స్ రోడ్ నం 36 బ్యాంబు పార్కును అభివృద్ధి చేసేందుకు ఎంఓ యూ కుదుర్చుకోనున్నారు. మరికొన్ని చోట్ల రహదారి విస్తరణలో భాగంగా 269 ఆస్తుల స్వాధీనం చేసుకునేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదించనున్నది.

వీటిన్నింటికంటే ముఖ్యంగా వ్యాపారుల నుంచి ముక్కుపిండి వసూలు చేసి ఖజానాను నింపుకొనే మరో కీలక ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రకటనల విభాగం తీసుకొస్తున్నది. వ్యాపారులు తమ షాపుల ముందు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ డిజిటల్ బోర్డుల నుంచి ప్రతి ఏటా ఫీజులు వసూలు చేయనున్నది.

మూడు కేటగిరీల్లో భాగం గా ఎస్ కేటగిరీలో రూ. 5500, ఏ కేటగిరీలో రూ. 5500, బీ కేటగిరీలో రూ. 5250, సీ కేటగిరీలో రూ.5వేల చార్జీలను వసూలు చేయనున్నది.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా వసూళ్లను రాబట్టనున్నది. ఖాజాగూడ జంక్షన్, ఐఐటీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నివారణకు శాశ్వత చర్యల్లో భాగంగా మల్టీలెవల్ ఫ్లై ఓవర్, రహదారి విస్తరణకు.. 749 కోట్లతో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు టెండర్ల అనుమతికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తీసుకోనున్నారు.

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై వారం దాటినా.. ఇంకా సేకరించని అధికారులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- అకాల వర్షాల భయంతో తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయం

కల్లాల్లోనే ధాన్యం.. అన్నదాత దైన్యం

ఏర్పుమళ్ళ కొనుగోలు కేంద్రానికి విక్రయించేందుకు తీసుకొచ్చిన ధాన్యం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 28 : తూతూమంత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి.. అందులో వడ్లను కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మెట్లకుంట, బురాన్‌పూర్, బొంరాస్‌పేట, ఒడిచెర్ల, కొత్తూరు, రేగడిమైలారం, తుంకిమెట్ల, చౌదరిపల్లి, బాపల్లి, ఏర్పుమళ్ళ తదితర గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను అధికారులు, నాయకులు కలిసి ప్రారంభించారు. అయితే, ఓపెన్ చేసి వారం రోజులు దాటినా ఏర్పుమళ్ళ, బాపల్లి, బొంరాస్‌పేట, మెట్లకుంట, బురాన్‌పూర్ గ్రామాల్లో గింజా ధాన్యాన్ని కూడా ఇప్పటివరకు కొనకపోవడంతో.. ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు సౌకర్యాల్లేక అకాల వర్షాలతో పంట మొత్తం నష్టపోతుందనే భయంతో మద్దతు ధర రాకున్నా.. రైతన్న మధ్య దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని.. ధాన్యాన్ని త్వరగా కొనాలని ఆదేశించినా కేంద్రాల నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల నుంచి ధాన్యాన్ని త్వరగా సేకరించాలని కోరుతున్నారు.

వెంటనే కొనాలి..

ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం తగదు. గోనె సంచులు, సిబ్బందిని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు త్వరగా ఏర్పాటు చేసుకుని.. వడ్లను రైతుల నుంచి సేకరించాలి. అకాల వర్షాలు పడితే అన్నదాతలు మొత్తం నష్టపోయే ప్రమాదం ఉంటుంది.

-మహేందర్‌రెడ్డి, ఏర్పుమళ్ళ

కల్లాల్లోనే ధాన్యం..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వారం రోజులు దాటినా వడ్లను కొనడం లేదు. దీంతో ధాన్యం కల్లాల్లోనే ఉంటున్నది. ఒకవైపు అకాల వర్షాలు పడుతుండడంతో ధాన్యం తడవకుండా ఉంచేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని సేకరించాలి.

- యాదగిరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, ఏర్పుమళ్ళ